క్లుప్తంగా

కలెక్టరేట్‌లో జాబ్‌మేళా


ఉద్యోగాలకు ఎంపికైన యువతతో కలెక్టర్ కీర్తి

సీటీఆర్‌ఐ: జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కీర్తి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో శనివారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. దీనికి 105 మంది హాజరు కాగా, వారిలో 107 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు అన్నారు. 10 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి కలెక్టర్ కీర్తి ఆఫర్ లెటర్లు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో మహాచండీ హోమాలు


దుళ్లలో చండీయాగం చేస్తున్న భక్తులు

కడియం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రముఖ ఆలయాల్లో శనివారం మహాచండీ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి దేవస్థానం, దుళ్లలోని శారదా అమ్మవారి ఆలయంలో వేద పండితుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన హోమగుండంలో ఆవు నెయ్యి, యజ్ఞ సమిధలను సమర్పిస్తూ వేద మంత్రోచ్చారణ మధ్య జరిగిన ఈ క్రతువును చూసేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. లోక క్షేమం కోరుతూ ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు ఆలయ భక్త బృందాలు తెలిపాయి.

నిప్పలగుండం తొక్కిన భవానీ మాలధారులు

కడియం: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా కడియంలోని మేకలదిబ్బ డౌన్‌లో రైస్‌మిల్లు వద్ద శుక్రవారం రాత్రి భవానీ మాలధారులు నిప్పులగుండం తొక్కారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం గురుభవానీల పర్యవేక్షణలో మాలధారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమాన్ని చూసేందుకు తరలివచ్చారు.

పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ



జేగురుపాడులో స్వచ్ఛత ర్యాలీ చేస్తున్న సర్పంచ్ స్టాలిన్ తదితరులు

కడియం: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. స్వచ్ఛతాహి సేవ 2025లో భాగంగా శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్ కుమార్, మాజీ అధ్యక్షుడు బళ్ల అన్నవరం, మద్దుకూరి పుల్లయ్య, మోహన్, అద్దంకి భాస్కర్ నారాయణ, మద్దుకూరి గోపి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ధవళేశ్వరం: గ్రామానికి చెందిన బూరా ఆకాంక్ష అనే వివాహిత అదృశ్యమైంది. ధవళేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకాంక్ష భర్త కువైట్‌లో పని చేస్తున్నాడు. ఆమె స్థానిక కాటన్ పేటలో నివాసం ఉంటోంది. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో సోదరుడు వెంకట దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ టి.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	:	కిష్కింధపురి
సూర్యమినీ	:	బ్యూటీ
సూర్యప్యాలెస్	:	ఓజీ
స్వామి	:	ఓజీ
అనుశ్రీ	:	ఓజీ
శివజ్యోతి	:	ఓజీ
రాజా	:	ఓజీ
ఊర్వశి	:	ఓజీ
మేనక	:	లిటిల్‌హార్ట్స్
రంభ	:	మిరాయ్
అప్సర	:	ఓజీ
అశోక నామవరం	:	కొత్త లోక
వీఎస్ మహల్ ధవళేశ్వరం	:	ఓజీ
మురళీకృష్ణ కడియం	:	ఓజీ
వెంకటసూర్య	:	ఓజీ

పూజ చేసేదెలా!

- భవానీ మాలధారుల అవస్థలు
- పుష్కరఘాట్‌కు తాళం వేసిన అధికారులు
- ఘాట్‌లో పూజకు కూడా అనుమతి నిరాకరణ
- గోదావరి ఉధృతి నేపథ్యంలో నిర్ణయం


పుష్కరఘాట్ గేటు మూసివేయడంతో బయటే పూజ చేసుకుంటున్న భవానీ మాలధారులు


శివుడి విగ్రహం వద్ద జల్లు స్నానం చేస్తున్న భక్తులు

సీటీఆర్‌ఐ: నగర పాలక సంస్థల అధికారుల తీరుతో భవానీ మాలధారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పూజ చేసుకోవడానికి చోటు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని పుష్కరఘాట్‌కు నిత్యం అధిక సంఖ్యలో భవానీ మాలధారులు వస్తూంటారు. ఇక్కడి గోదావరి రేవులో స్నానం ఆచరించి, అక్కడే ఉన్న ఖాళీ స్థలంలో అమ్మవారికి పూజలు చేసుకుంటారు. అయితే ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరికి వరద ఉధృతి పెరిగింది. దీంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గోదావరిలో స్నానాలకు దిగవద్దని అధికారులు ఆదేశించారు. ఇది మంచి విషయమే అయినప్పటికీ ఘాట్‌లో పూజ చేసుకునేందుకు కూడా భవానీ భక్తులను అనుమతించకుండా శనివారం గేట్లు మూసేశారు.

తెల్లవారుజామునుంచే రద్దీ

దసరా సమయంలో అనేక మంది భక్తులు భవాని మాలధారణ చేస్తారు. వీరితో పాటు శివ స్వాములు కూడా ప్రతి రోజూ వేకువజాము 4 గంటల నుంచి పుష్కరఘాట్‌కు స్నానానికి వస్తారు. నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన మాలధారులతో ఘాట్ కిటకిటలాడుతోంది. అయితే గోదావరిలో నీటి మట్టం 53 అడుగులకు చేరడంతో శనివారం పుష్కరఘాట్ గేట్లను మూసివేశారు. ప్రతి రోజూ మాదిరిగానే అధిక సంఖ్యలో భక్తులు స్నానాలు చేయడానికి ఘాట్‌కు చేరుకున్నారు. అక్కడి గేట్లకు తాళం వేసి ఉండడాన్ని గమనించి, ప్రత్యామ్నాయంగా శివుడి విగ్రహం వద్ద జల్లు స్నానం చేయడానికి ఉపక్రమించారు. కానీ అక్కడ నుంచి చాలా సన్నగా నీటి ధార రావడంతో ఇబ్బంది పడ్డారు.

పుష్కరఘాట్‌లోనే పూజ

సాధారణంగా భవాని, స్వామి మాలలు ధరించిన భక్తుల్లో అధిక శాతం పుష్కరఘాట్‌లోనే స్నానం చేసి, అక్కడే ఉన్న అమ్మవారికి పూజ చేస్తారు. అనంతరం తమ రోజు వారీ కార్యక్రమాలు చేపడతారు. కొందరు ఘాట్‌లో స్నానం చేసిన తర్వాత తమ పీఠంలో పూజ చేసుకుంటారు. కానీ పుష్కరఘాట్‌లో పూజలు చేసే భక్తులే ఎక్కువగా ఉంటారు. స్నానానంతరం అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, శరణ ఘోష చెప్పిన తర్వాత ఫలహారం స్వీకరిస్తారు. కానీ శనివారం వారికి ఘాట్‌లో పూజ చేసుకునేందుకు అవకాశం లేకుండా గేట్లు మూసేశారు. నదిలోకి దిగబోమని, గట్టుపైనే పూజ చేసుకుంటామని అక్కడ సిబ్బందిని వేడుకున్నా ఫలితం లేకపోయింది. కనీసం అమ్మవారిని దర్శించుకోవడానికి కూడా అనుమతి ఇవ్వలేదు. చేసేది లేక గేటు బయట నుంచే దండం పెట్టుకుని వెళ్లిపోయారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుమలత

రాజమహేంద్రవరం రూరల్: జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ -5 సెక్రటరీలకు మండల ప్రత్యేకాధికారి, ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ సుమలత సూచించారు. హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. సుమలత మాట్లాడుతూ ప్రజలకు జీఎస్టీ మేలు సులభంగా అర్థమయ్యేలా నెల రోజుల పాటు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరిట ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఆదాయ వనరుల పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి ఆకెళ్ల ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-5 సెక్రటరీలు పాల్గొన్నారు.

321 మందికి వైద్య పరీక్షలు

కడియం: మండలంలోని జేగురుపాడు, మురమండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో 321 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసినట్లు ప్రభుత్వ వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

వ్యాపారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


వీధి వ్యాపారులకు నమూనా చెక్కు అందజేస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: వీధి విక్రయదారులు తమ ఉత్పత్తులలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, ఆయా వ్యాపారాలలో రాణించాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆనం కళా కేంద్రంలో శనివారం వీధి విక్రయదారులకు లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ, లేబర్ డిపార్ట్‌మెంట్లతో పాటు పొదుపు సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. అలాగే వీధి వ్యాపారులకు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేళాలో సుమారు 1,200 మంది వీధి విక్రయదారులు పాల్గొన్నారు. వారిలో 81 మందికి రుణాలకు సంబంధించిన రూ.31.25 లక్షల నమూనా చెక్కును అందజేశారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ రుణాలు పొందని అర్హులు.. మెప్మా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెప్మా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకరాజు మాట్లాడుతూ 2020 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం ద్వారా ఇప్పటి వరకూ మూడు విడతలలో అనేక మంది తక్కువ వడ్డీతో వచ్చే రుణాలను తీసుకుని తమ వ్యాపారాలను విస్తరించారన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రూకయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రకాష్, యూనియన్ బ్యాంక్ ఇన్‌చార్జి చిట్టితల్లి, సీఎంఎం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారమివ్వండి


వెంకటేశ్వరరావు, కడియం ఇన్‌స్పెక్టర్


గణేష్, ధవళేశ్వరం సీఐ

కడియం: ఇతర రాష్ట్రాలకు చెందిన అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కు ఫోన్ చేయాలని కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు కోరారు. ఒంటరిగా ఉండే వృద్ధులు, శివారు ప్రాంతాల్లో నివాసం ఉండేవారు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపు కొడితే వెంటనే తియ్యవద్దన్నారు. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో తెలియనివాళ్లు ఎవరైనా తలుపులు కొడితే తీయకూడదని హెచ్చరించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ దొంగతనాలు చేసేందుకు సంచరిస్తున్నట్లుగా గుర్తించారన్నారు. నెల్లూరు జిల్లా కావలి, కాకినాడ జిల్లా ప్రత్తిపాడు, తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల, తణుకుల్లో జరిగిన చోరీల్లో ఈ గ్యాంగ్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రాత్రి వేళల్లో ఒంటరిగా తిరగొద్దు

ధవళేశ్వరం: జిల్లాలో ధార్ గ్యాంగ్ సంచరిస్తోందని, రాత్రి వేళల్లో ప్రజలు ఒంటరిగా తిరగొద్దని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ సూచించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ధవళేశ్వరం, కడియం, రాజవోలు, బొమ్మూరు ప్రాంతాలలో ఈ గ్యాంగ్ తిరిగే అవకాశం ఉందన్నారు. అర్ధరాత్రి సమయంలో ఎవరైనా తలుపులు బద్దలుకొడితే తీయవద్దన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉదయం వేళల్లో ఆటోల్లో తిరుగుతూ రెక్కి నిర్వహించే ఈ గ్యాంగ్.. అర్ధరాత్రి దాటాక ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతోందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆందోళనలు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రైమరీ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక అన్నారు. ఈ మేరకు శనివారం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావుకు పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ ఈ నెల 25 తేదీలోగా తమ డిమాండ్లను నెరవేర్చాలని గతంలో అధికారులకు నోటీసులు అందజేశామని, కానీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాలేదన్నారు. దీంతో ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్ రిపోర్టింగ్, అధికారిక పనులను నిలిపివేశామన్నారు. శనివారం సంచార చికిత్స, ఇతర క్యాంప్ డ్యూటీలను బహిష్కరించామన్నారు. ఆదివారం నుంచి దశల వారీగా కార్యక్రమాలు చేపడతామన్నారు. తమ సమస్యలపై దీర్ఘకాలంగా జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనకు దిగాల్సి వచ్చిందన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన


ఈవీఎం గోడౌన్ వద్ద కలెక్టర్ కీర్తి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ కీర్తి చేకూరి శనివారం పరిశీలించారు. లాలాచెరువు వద్ద ఎఫ్‌సీఐ గోడౌన్‌లో భద్రపరచిన ఈవీఎమ్‌లను ఆర్‌డీఓ కృష్ణ నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచుతామని తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న టీవీ నటి వర్ష


అమ్మవారి సన్నిధిలో టీవీ నటి వర్ష తదితరులు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని కనక దుర్గమ్మను టీవీ నటి వర్ష శనివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ కమిటీ సాదర స్వాగతం పలికింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వర్ష మాట్లాడుతూ ప్రతి ఏటా శరన్నవరాత్ర ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తుంటానన్నారు. అనంతరం ఆలయం వద్ద ప్రసాద వితరణ చేశారు.

ఇనుగంటివారిపేటలో చోరీ

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని చొంగ దుర్గాప్రసాద్ ఇంటిలో రూ.2.10 లక్షలు చోరీకి గురయ్యాయని ఎస్సై డి.రామ్ కుమార్ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. దుర్గాప్రసాద్ రావులపాలెంలోని ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తుంటాడు. పది రోజులకు ఒకసారి ఇనుగంటివారిపేట తన ఇంటికి వస్తుంటాడు. అతడికి గల రెండు పోర్షన్ల ఇల్లు ఉండగా, ఒక దానిలో నాన్నమ్మ ఉంటున్నారు. ఆమె శుక్రవారం రాత్రి అదే గ్రామంలోని వేరే ఇంటిలో నిద్రించింది. కాగా శనివారం ఉదయం దుర్గా ప్రసాద్‌కు పెదనాన్న కుమార్తె ఫోన్ చేసి.. మీ ఇంటి తలుపులు పగలుకొట్టి ఉన్నాయని చెప్పింది. దీంతో దుర్గాప్రసాద్ ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని రూ.1.60 లక్షలు, నానమ్మ ఉంటున్న పోర్షన్‌లో రూ.50 వేలు మాయమయ్యాయి. ఈ మేరకు బాధితుడు సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో ఆధారాలను సేకరించింది.

జయములివ్వు జగజ్జనని


ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో లలితా దేవి అలంకరణలో పార్వతీమాత


వాసవీ కన్యకా పరమేశ్వరి


మోరంపూడిలో..

సీటీఆర్‌ఐ: జయములివ్వు జగజ్జనని అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో జగన్మాతను పూజించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా దేవీచౌక్‌లోని అమ్మవారు శనివారం శ్యామలాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గోదావరి గట్టున గల మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో స్వయంభూ పార్వతీ మాత... లలితాదేవిగా, సరస్వతీ పీఠంలో లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. కాగా.. దేవీచౌక్‌లో అమ్మవారిని ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్, ఇతర పోలీసు అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఉత్సవ కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరి కొండపై గల అంగన్‌వాడీ కేంద్రంలో శరన్నవరాత్రుల సంబరాలు ఘనంగా నిర్వహించారు. దుర్గామాత వేషధారణలు, ఇతర వేషధారణలతో చిన్నారులు అలరించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి తోట శ్రీదేవి, సీడీపీవో గౌరవమ్మ, ఏసీడీపీవో కనకవల్లి, సూపర్ వైజర్ దుర్గామణి పాల్గొన్నారు.

- మోరంపూడి సాయినగర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించినట్లు ఆలయ ధర్మకర్త మేడి త్రిమూర్తులు తెలిపారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయకనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.


దేవీచౌక్ అమ్మవారి సన్నిధిలో ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు


దుర్గమ్మల వేషధారణలో బొమ్మూరులోని వెంకటగిరి కొండపై గల అంగన్‌వాడీ చిన్నారులు

ఈఆర్‌సీపీలో 96 మంది వైద్యులకు ఫెలోషిప్

రాజానగరం: స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో ఫెలోషిప్ ఆఫ్ ది ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోసర్జన్స్ (ఎఫ్ఐజీఐఈ) వర్క్‌షాప్ శనివారం జరిగింది. దేశంలోని లాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్ సర్జన్లకు ఇచ్చే ఈ ప్రతిష్టాత్మక శిక్షణలో ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీతో పాటు తొమ్మిది రాష్ట్రాల నుంచి 19 మంది ప్రాక్టీసింగ్ సర్జన్లు, సర్జరీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న 77 మంది మెడికోలు పాల్గొన్నారు. ఈఆర్‌సీపీ ప్రొసీజర్లలో నిపుణులైన ఈశ్వరమూర్తి, సతీష్ కుమార్ మిదా, సి.సిద్దేష్, అరుణ్ కార్యంపూడి, గన్ని భాస్కరరావు, సమీర్ రంజన్ నాయక్, వేగుళ్ల వెంకట ముఖేష్ మార్గదర్శకత్వంలో ఆరు థియేటర్లలో చేసిన 36 ఆపరేషన్లను లైవ్ చూపించారు. ఈ శిక్షణలో ఎండోస్కోపిక్ రెట్రోగ్రేడ్ కొలాంజియోపాంక్రియాటోగ్రఫీ (ఈఆర్‌సిపి) టెక్నిక్స్ పై అవగాహన కలిగించారు.

ఈఆర్‌సీపీ అంటే..

కాలేయం, పిత్తాశయం, క్లోమ గ్రంథులకు సంబంధించిన సంక్లిష్ట సమస్యలను గుర్తించి చికిత్స చేయడానికి ఉపయోగించే ప్రత్యేకమైన ఎండోస్కోపిక్ విధానాన్నే ఈఆర్‌సీపీ అంటారు. దీని ద్వారా పిత్తాశయంలో రాళ్లను తొలగించడం, క్యాన్సర్ గడ్డలను గుర్తించడం, జాండిస్ వంటి సమస్యలకు కారణమయ్యే అడ్డంకులను తొలగిస్తారు. ఇది అత్యంత నైపుణ్యంతో కూడిన ప్రక్రియ. ఏ చిన్నపొరపాటు జరిగినా క్లోమం వాపు (పాంక్రియాటైటిస్) వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం 5 నుంచి 10 శాతం వరకు ఉంటుంది. ఈ కారణంగానే ఈ విధానంలో వైద్యులకు నిరంతరం శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవసరం.

ఫెలోషిప్ ప్రత్యేకత

సాధారణంగా వైద్యులు పీజీ (ఎండీ/ఎంఎస్) పూర్తి చేసిన తరువాత ఒక నిర్దిష్ట విభాగంలో మరింత లోతైన, ఉన్నత స్థాయి నైపుణ్యం సంపాదించడం కోసం చేసే ప్రత్యేక శిక్షణనే ఫెలోషిప్ అంటారు. ఈ క్రమంలో ఫెలోషిప్ ఆఫ్ ది ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఎండోసర్జన్స్ (ఎఫ్ఐజీఐఈ) అనేది లాప్రోస్కోపిక్, ఎండోస్కోపిక్ సర్జన్లకు ఇచ్చే ఒక ప్రతిష్టాత్మక ఫెలోషిప్. దీని ద్వారా వైద్యులు క్లిష్టమైన ఆపరేషన్లను సురక్షితంగా, సమర్థవంతంగా చేయగల నైపుణ్యం, ఆత్మవిశ్వాసాన్ని పొందుతారని కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ గన్ని భాస్కరరావు వివరించారు.